## క్లుప్తంగా

### వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వాసవీ అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని చిన్నబజారు వద్దగల వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి క్షీరాభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అష్టోత్తర శతనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### అన్నపూర్ణ సేవకు రూ.10 వేల విరాళం


విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణానికి చెందిన సీనియర్ అడ్వకేట్ ఎన్.వి.శేషగిరిరావు రిమ్స్ అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి రూ.10 వేలు విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తాన్ని అన్నపూర్ణ పథకం కార్యదర్శి కిల్లాన ఫాల్గుణరావుకు శనివారం అందచేశారు. విరాళం అందించినందుకు సంఘం అధ్యక్షులు గంగుల రమణబాబు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కిల్లాన భోజ్‌కుమార్ ఉన్నారు.

### గణితంపై భయం వీడాలి


మాట్లాడుతున్న రీసోర్స్ పర్సన్ సురేష్

ఎచ్చెర్ల క్యాంపస్: గణితం సబ్జెక్టుపై విద్యార్థులకు ఆసక్తి అవసరమని రీసోర్స్ పర్సన్ ముద్దాడ సురేష్ కుమార్ అన్నారు. ధర్మవరం గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. ఈ శిబిరంలో భాగంగా గణితం సబ్జెక్టుపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎక్కాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, గణితంలో పాఠ్యాంశాలకు సంబంధించిన సూత్రాలు కీలకమన్నారు. శాతాలు, సంఖ్యా వ్యవస్థ, డిస్కౌంట్, భారీ వడ్డీ, చక్రవడ్డీ వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. నిరంతర సాధన వల్ల గణితంలో పట్టు వస్తుందన్నారు. గణితంపై భయం వద్దని చెప్పారు. గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర్, సహాయకులు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

### ఉపాధి పనుల పరిశీలన


చెరువు గట్టుపై వేసిన మొక్కలను పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పనులను ఉదయం 6 గంటలకు ప్రారంభించి పది వరకు చేపట్టాలని డ్వామా పీడీ చిట్టిరాజు తెలిపారు. లావేరు మండలంలోని మురపాక, పెద్దరావుపల్లి, చిన్నయ్యపేట గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. సొంత వ్యవసాయ పనులను ఏ విధంగా చేపడతారో అదే విధంగా ఉపాధి పనులను కూడా చేపట్టాలన్నారు. ఇచ్చిన కొలతల మేరకు పనులు చేపడితే రోజుకు రూ.300 వేతనం లభిస్తుందన్నారు. అనంతరం చెరువు గట్టుపై వేసిన మొక్కలను పరిశీలించారు. ఉపాధి ఏపీఓ రెడ్డి సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### నేటినుంచి కొత్తపేటలో గ్రామదేవత ఉత్సవాలు


ముస్తాబైన పెద్దమ్మతల్లి ఆలయం

వజ్రపుకొత్తూరు: మండలంలోని తీర ప్రాంత గ్రామమైన కొత్తపేటలో గ్రామ దేవత పెద్దమ్మ తల్లి ఉత్సవాలను ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ అంబటి శ్రీను తెలిపారు. ఉత్సవాల కోసం అమ్మవారి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. అన్నివీధుల్లో విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేశామన్నారు. తొలిరోజున దేవరను తీసుకురావడంతోపాటు పగటి వేషాలు, స్టేజీ ఈవెంట్స్, పౌరానిక ఘట్టాలు, అమ్మవారికి చల్లదనం, ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించే కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. మంచి వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఎచ్చెర్ల పోరులో.. రణస్థలమే కీలకం

- ప్రధాన పార్టీ అభ్యర్థులిద్దరూ రణస్థలం వాసులే
- పంచాయతీ ఎన్నికలను తలపించిన సార్వత్రిక పోరు
- గత లెక్కల ప్రకారం వైఎస్సార్‌సీపీకే అనుకూలం


జే.ఆర్.పురంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పోటీదారులైన అభ్యర్థులిద్దరూ రణస్థలం మండల వాసులే కావడంతో ఈ మండలంపై ప్రత్యేక దృష్టి సంతరించుకుంది. ఈ సారి మండల ఓటర్లు ఎవరికి జై కొడతారో ఆసక్తి నెలకొంది. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ భారీ విజయానికి రణస్థలం మండలమే కారణం. 2024లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.ఈశ్వరరావు రణస్థలం మండల వాసులే. విజయనగరం టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుది కూడా రణస్థలం మండలం. ఈ మండలంలో గొర్లె శ్రీరాములనాయుడు, గొర్లె హరిబాబునాయుడుల తరువాత ఆ స్థాయిలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ రాజకీయాల్లో రాణించారు. శ్రీరాములనాయుడు, హరిబాబునాయుడులు ప్రత్యక్ష రాజకీయాల్లో గెలవలేదు. రణస్థలం మండల 80 పోలింగ్ బూత్‌ల పరిధిలో 65,055 ఓటర్లు ఉండగా 88.82 శాతం ఓటింగ్ నమోదైంది.

**హోరాహోరీగా ప్రచారం..**

ప్రధాన పార్టీల అభ్యర్థులు రణస్థలం మండలానికే చెందినవారు కావడంతో పంచాయతీ ఎన్నికలను తలపించేలా హోరాహోరీగా ప్రచారం సాగింది. అభ్యర్థులు ఏ పంచాయతీ నుంచి ఎన్ని ఓట్లు సాధించగలమో కచ్చితంగా చెప్పలేక పోతున్నారు.

**వైఎస్సార్‌సీపీకి కంచుకోటలా రణస్థలం..**

2019 సార్వత్రిక ఎన్నికల్లో 18,711 ఓట్ల భారీ మెజార్టీతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ గెలుపొందారు. అందులో రణస్థలంలోనే 8,637 ఓట్లు అధిక్యత సాధించారు. 2014లోనూ రణస్థలంలో కిరణ్‌కుమార్‌కు అధిక మెజార్టీ వచ్చింది. ఇక్కడ 25 ఎంపీటీసీలకు 17 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జయకేతనం ఎగురవేయగా.. 34 పంచాయతీలో 23 మంది సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీనే కొల్లగొట్టింది. ఇక్కడ ప్రధానంగా అధిపత్యం కొనసాగించే కాపు, మత్స్యకార, దళిత, యాదవ, తెలగ, రెడ్డిక వర్గాలతోపాటు బలహీన వర్గాల సపోర్టు వైఎస్సార్‌సీపీకే ఉంది.

50 శాతానికి పైగా కాపులు ఉండే మండలంలో ఒక శాతం కూడా లేని కమ్మ సామాజిక వర్గానికి కూటమి తరపున టికెట్ ఇచ్చారు. కాపు ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారో చూడాల్సి ఉంది.

**గత ఎన్నికలకు భిన్నం..**

2024 ఎన్నికలు గత ఎన్నికల కంటే భిన్నంగా ఉంది. ఎచ్చెర్ల ఎమ్మెల్యే స్వగ్రామం పాతర్లపల్లిలో టీడీపీ నాయకులు అంతంత మాత్రంగానే ఉన్నారు. ఆ పంచాయతీలో ఓటర్లను ప్రభావితం చేసే కుటమి నాయకులు లేకపోవడంతో భారీ మెజార్టీట సాధించడం నల్లేరుపై నడకే. బీజేపీ అభ్యర్థి ఈశ్వరరావు పంచాయతీ అయిన బంటుపల్లి, కూటమి ఎంపీ అభ్యర్థి అప్పలనాయుడు పంచాయతీ అయిన వి.ఎస్.పురంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. ఈ పంచాయతీల్లో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు హోరాహోరీగానే సాగాయి. యర్రవరం, తెప్పలవలస, మరువాడ, పైడిభీమవరం, జే.ఆర్.పురం, కోటపాలెం, ఎస్.జీ.ఆర్.పురం, మహంతిపాలెం, కృష్ణాపురం, సంచాం, అర్జునవలస, పిషిని వంటి సుమారు 20 పంచాయతీలు వైఎస్సార్‌సీపీకి బలంగా ఉన్నాయి. కూటమి అభ్యర్థి వైఎస్సార్‌సీపీ బలం ముందు నిలవలేరని రాజకీయ విశ్లేషకుల మాట. రణస్థలం మండల ఓటర్లు ఫ్యాన్ వైపే ఉన్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు నమ్మకంగా చెబుతున్నారు.

## ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులకు అభినందన


ఎంపికైన విద్యార్థినులతో కళాశాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఐటీ, పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగాల సాధనకు సరైన వేదికగా శ్రీకాకుళంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల నిలుస్తుందని డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ తెలిపారు. డిగ్రీ ఫైనలియర్ చదువుతూ.. డిగ్రీ పట్టా అందుకోకముందే తమ కళాశాల నుంచి ఇప్పటి వరకు 351పైగా కార్పొరేట్ ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ నేపథ్యంలో శనివారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో వీరు మాట్లాడారు. ఇంటర్ తర్వాత ఏంచేయాలనేది ఆలోచించకుండా నేరుగా డిగ్రీలో తమ పిల్లలను జాయిన్ చేసి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. తమ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం నుండే ఉద్యోగాలకు ఉపయోగపడే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే సాఫ్ట్‌వేర్ కోర్సులకు సంబంధించి కోడింగ్, డీకోడింగ్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ లాంగ్వేజ్‌పై తర్ఫీదు ఇస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులకు ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వీ.ఎల్ నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు


మాట్లాడుతున్న నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జోష్యుల ప్రతాప్

ఎచ్చెర్ల: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని ప్రతీ విద్యార్థి వేసవి శిక్షణ శిబిరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని రీసోర్స్ పర్సన్ నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జోష్యుల ప్రతాప్ అన్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరంలో శనివారం విద్యార్థులకు గ్రంథాలయాలు, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రతీ విద్యార్థి పాఠ్యపుస్తలకే పరిమితం కాకుండా గ్రంథాలయాలకు వచ్చి జనరల్ నాలెడ్జికి సంబంధించి పుస్తకాలను, దిన, వార, మాస పత్రికలను పూర్తిస్థాయిలో చదవాలన్నారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పరామర్శ..


చాంద్ బాషా కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండల గుర్రాలపాలెం పంచాయతీ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు చాంద్ బాషా తల్లి శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ చాంద్ బాషా కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు జగ్గురోతు తవిటినాయుడు, ఇజ్జాడ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

## సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ


నిహాన్ కశ్యప్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట గ్రామానికి చెందిన మొదలవలస నిహాన్ కాశ్యప్ సైనిక్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో జాతీయస్థాయితో మెరిశాడు. ఈ ఏడాది జనవరి 28వ తేదీన జరిగిన పరీక్షలో 300 మార్కులకు 265 సాధించి ఆలిండియాస్థాయిలో రెండువేల ర్యాంకు సాధించాడు. దీంతో ఐదు స్కూళ్లలో సీటు దక్కగా.. చివరకు చిత్తూరు జిల్లాలోని కలికిరి సైనిక్ స్కూల్‌లో అడ్మిషన్‌కు అంగీకరించారు. కేశవరావుపేటకు చెందిన మొదలవలస వంశీకృష్ణ, లక్ష్మి తల్లిదండ్రులు. నిహాన్ కాశ్యప్ తండ్రి వంశీకృష్ణ ఓ కార్పొరేట్ సంస్థలో ఉన్నత ఉద్యోగం చేస్తుండగా.. తల్లి లక్ష్మి గృహిణి.

## నగరవీధులలో హరినామ సంకీర్తన


నగర సంకీర్తన చేస్తున్న కమిటీ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కలెక్టర్ బంగ్లా వద్దగల కల్యాణ వేంకటేశ్వర స్వామి కమిటీ సభ్యులచే శనివారం సందర్భంగా నగరవీధులలో హరినామ సంకీర్తనలు జరిగాయి. ఆలయ అర్చకులు వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ భక్తులచే నగరవీధుల హరినామ సంకీర్తనలు, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ సభ్యులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు ఉన్నారు.

## వేదవిద్యకు ఊపిరి


భాస్కరభట్లని సత్కరిస్తున్న మందిరం సభ్యులు


శ్రీకాకుళం కల్చరల్: వేదవిద్యకు ఊపిరి పోసిన మహానుభావులు విద్యారణ్యులని ప్రముఖ వక్త భాస్కరభట్ల శ్రీరామశర్మ అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో మహానుభావుల జయంతి వేడుకలలో భాగంగా విద్యారణ్యుల కోసం ఆయన శనివారం ప్రసంగించారు. వేదాంత పంచదశి, అనుభూతి ప్రకాశము తదితర రచనల ద్వారా ప్రజలలో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించారని అన్నారు. ముందుగా వక్త శ్రీరామశర్మని మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో మణికొండ రామారావు, ఎస్.నారాయణమూర్తి, పప్పు పతంజలి శాస్త్రి, పి.అప్పలకొండ, ఎం.శ్రీనివాసరావు, బాబూరావు, ఈశ్వరరావు, సంగమేశ్వరరావు ఉన్నారు.

### వెంకన్నకు ప్రత్యేక అలంకరణ


ప్రత్యేక అలంకరణలో మొండేటివీధిలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక మొండేటివీధిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగాయి. ఆలయ అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. అలాగే స్థానిక చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా పూజలు జరిగాయి. స్వామిని తులసీదళాలు, పూలమాలలతో అలంకరణ చేశారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

## ఆ ప్రాంతం ఆహ్లాదకరం!


వాడాడ జంక్షన్ నుంచి వప్పంగి గ్రామాల మధ్య చెట్లతో అలుముకున్న నీడ


చెట్ల నీడలో సేదదీరుతున్న జీవాలు

మండువేసవిలో సైతం ఆ ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంటుంది. చల్లని వాతావరణం ఆ ప్రదేశానికి చేరుకోగానే శరీరాన్ని ముద్దాడుతోంది. దీంతో ఆ ప్రాంతమంటే ఇటుగా వెళ్లేవారికి ఎంతోఇష్టం. కనీసం ఐదు నిమిషాలైన అక్కడ ఆగి వెళ్లేందుకు ఆసక్తి చూపుతారు. శ్రీకాకుళం–కళింగపట్నం రోడ్డులో వాడాడ జంక్షన్ నుంచి వప్పంగి గ్రామాల మధ్య ఈ అహ్లాదకరమైన వాతావరణం నెలకొని ఉంది. మర్రితోపాటు వివిధ రకాల చెట్లు విస్తారంగా పెరగడంతో రోడ్డుకు ఇరువైపులా నీడకమ్ముకొని ఉంటుంది. దీంతో మండువేసవిలో కూడా శీతాకాలం వలే ఇక్కడ ఉంటుంది. మంచి వాతావరణం ఉండడంతో కొంత మంది వ్యాపారులు చిన్నచిన్న దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. వేసవిలో గొర్రెలు, మేకల పెంపకందారులు తమ జీవాలను చల్లదనం కోసం ఈ చెట్ల నీడకు తీసుకొస్తారు. – గార

## ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: తమ్మినాయుడుపేటలోని చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయ ధర్మకర్త సాగి శ్రీనివాసరాజు వర్మ దంపతులో ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శ్రీపాద సురేష్‌శర్మ వేద మంత్రాల నడుమ కల్యాణ వేడుకలు సంప్రదాయంగా నిర్వహించారు. సహ అర్చకులు నవీన్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరబ్రహ్మేంద్ర ఆరాధనోత్సవం


స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలో కామాక్షి స్వర్ణకార సేవా సంఘం సభ్యులు, విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధాన మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మంగారి ఆలయంలో ఉదయం ఐదు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఊరేగింపులో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీకంచి కామాక్షి స్వర్ణకార సేవా సంఘం, శ్రీగోవిందబాంబ సమేత వీరబ్రహ్మేంద్రమ్మ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.